సాక్షి ఆదిలాబాద్

శనివారం, 3, జూన్, 2023



ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీచైర్మన్ జనార్దన్ అన్నారు. తాడిహత్నూర్‌లో శివాజీ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట మహాపూజ నిర్వహించారు. 9లో▸

శాంతిభద్రతలపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్‌టౌన్: శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ నెల 6న జిల్లా కేంద్రానికి బీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ వస్తున్న సందర్భంగా భద్రత చర్యలు చేపట్టాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్పీని కలిసిన వారిలో దళిత సంఘాల నాయకులు దుర్గం శేఖర్, దీపక్, సందీప్, ప్రజ్ఞకుమార్, సురేందర్, రాంచందర్, గంగారాం, రాహుల్ తదితరులు ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అమరవీరుల కుటుంబాలకు సన్మానం



అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సి.రాంచంద్రారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ అమరవీరుల కుటుంబాలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సీఆర్ఆర్ నివాసంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ చేపట్టారు. గాంధీ చౌక్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్పా ఎవరికి ప్రయోజనం దక్కలేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, పార్టీ నాయకులు సంజీవ్‌రెడ్డి, అశోక్, శ్రీధర్, శంతన్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: 2023-24 విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాల విక్రయాల అనుమతి కోసం ఆసక్తిగల దుకాణదారులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. వ్యాట్ లైసెన్స్, టర్నోవర్ ట్యాక్స్, ఆడిట్‌రిపోర్టు, జీఎస్టీతో పాటు రూ.3వేల డీడీ డీఈవో పేరిట తీసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో పనిచేసేందుకు..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8లోగా జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సర్‌ప్లస్ ఉన్నచోట సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్ గణితం 1, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ 1, సామాన్య శాస్త్రం 1, సాంఘిక శాస్త్రం 1, ఇంగ్లీష్ 1, హిందీ ఎల్‌పీ 1, తెలుగు ఎల్‌పీ ఎస్జీటీ 3 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతు దినోత్సవం విజయవంతం చేయాలి



అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మావల మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో రైతులతో సమావేశం నిర్వహించాలన్నారు. వ్యవసాయ శాఖ పథకాల విశిష్టత తెలియజేసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని చెరువును పరిశీలించారు. ఈ నెల 8న నిర్వహించనున్న చెరువుల పండుగ నేపథ్యంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచనలు చేశారు. ఆయన వెంట శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ ఇమ్రాన్, జెడ్పీటీసీ వనిత, సర్పంచ్ ప్రమీల, ఎంపీడీవో అరుణ, తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ సైన్స్‌ఫెయిర్‌కు పొన్న విద్యార్థి

సిరికొండ: మండలంలోని పొన్న గ్రామానికి చెందిన డోబ్లే రుషీకేశ్ అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఇతడు ఇచ్చోడ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జాతీయ స్థాయిలో నిర్వాహించిన సైన్స్‌ఫెయిర్ పోటీల్లో.. గర్భిణులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన రైల్వే బెర్త్ నమూనాను ప్రదర్శించాడు. ఇందుకు గాను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ చేతుల మీదుగా అవార్డు సైతం అందుకున్నాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి రఘురాం తెలిపారు. సకుర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్ ద్వారా ఆ దేశాన్ని సందర్శించి అక్కడి నూతన సాంకేతికతను దగ్గరి నుంచి తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. రుషికేశ్‌ను డీఈవో ప్రణీతతో పాటు జిల్లా సైన్స్ అధికారి రఘురాం, గైడ్ టీచర్ కంది రామకృష్ణ, ఉపాధ్యాయులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



జాతీయ గీతాలాపన చేస్తున్న విప్, అధికారులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- తొమ్మిదేళ్లలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న విప్ గోవర్ధన్

కైలాస్‌నగర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం తొమ్మిదేళ్ల పాలనలో యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇదే స్ఫూర్తితో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించారు. తెలంగాణచౌక్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయగీతం ఆలపించిన అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల ఉద్దేశించి ప్రసంగించారు. తొమ్మిదేళ్ల పాలనలో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్రం ఏర్పడిన నాటికి జిల్లాలో 4,88,925 ఎకరాలు సాగులో ఉండగా ఈ ఏడాది వరకు అది 7,33,875 ఎకరాలకు పెరిగిందన్నారు. రైతుబంధు పథకం కింద జిల్లాలో 1,47,161 మంది రైతులకు రూ.2,364 కోట్ల పెట్టుబడి సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు. వివిధ కారణాలతో 3,088 మంది రైతులు మరణించగా బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.14.08కోట్లు వారి నామినీ ఖాతాల్లో జమచేసి అండగా నిలిచామన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 1,234 ఆవాసాలకు రూ.337కోట్లు వెచ్చించి 1,69,270 ఇళ్లకు నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధజలాన్ని అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయానికి 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. జిల్లాలో 693 అవాసాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం, టీఎస్ ఐపాస్ కింద 197 పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 71,742 మంది ఆసరా లబ్ధిదారులకు రూ.18.36 కోట్ల పింఛన్‌ను ప్రతీ నెల అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. దళిత కుటుంబాల సమగ్ర ఆర్థికాభివృద్ధి కోసం దళితబంధు ప్రవేశపెట్టి తొలివిడతలో 249మంది లబ్ధిదారులకు రూ.24.65 కోట్లను వారి ఖాతాల్లోకి విడుదల చేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా నిరుపేద ఆడబిడ్డల వివాహం కోసం 29,082 మందికి రూ.264.18 కోట్ల ఆర్థికసాయం చెక్కులను అందజేశామని తెలిపారు. సమాజాభివృద్ధికి చదువే మూలమని గుర్తించి జిల్లాలో 237 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కింద కార్పొరేట్‌స్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లుగా చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన 39,565 మంది బాలింతలకు కేసీఆర్ కిట్స్ అందించడంతో పాటు రూ.32.72కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. 7703 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ అందించామన్నారు. కంటి వెలుగు ద్వారా 3,34,133 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 38,808 మందికి రీడింగ్ గ్లాసులు ,34,014 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు అందించామన్నారు. రిమ్స్‌లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా రూ.11.65 కోట్ల ఎంఆర్ఐ పరికరాన్ని మంజూరు చేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలో రైల్వే ఒవర్, అండర్ బ్రిడ్జి పనులకు రూ.97.20 కోట్లతో పనులు ప్రారంభమవుతున్నాయని, జిల్లా సమీకృత కార్యాలయ భవనానికి రూ.55 కోట్లు మంజూరయ్యాయన్నారు. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూములకు సంబంధించి 19,779 రిజిస్ట్రేషన్లు చేయగా వివిధ మాడ్యుల్స్ ద్వారా ఇప్పటి వరకు 7342 సమస్యలు పరిష్కరించినట్లుగా వెల్లడించారు. నేరాల నియంత్రణకు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 350 సీసీ కెమెరాలతో 24గంటల పాటు భద్రతను పోలీస్‌యంత్రాంగం పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, డీఎఫ్‌వో రాజశేఖర్, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, డీసీసీబీ, మున్సిపల్ చైర్మన్లు అడ్డి భోజారెడ్డి, జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, ఆర్డీవో రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన గేయం అందరినీ ఆకట్టుకుంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఆయా కార్యాలయాల్లో పండగ వాతావరణం కనిపించింది. అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జోగు ప్రేమేందర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. డీఆర్డీఏ కార్యాలయంలో డీఆర్డీవో కిషన్, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ప్రణీత, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ సంపత్ కుమార్, వైద్యారోగ్యశాఖలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐసీడీఎస్‌లో పీడీ మిల్కా, సంక్షేమశాఖల కార్యాలయ సముదాయంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. అలాగే ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ రాజేందర్ నాయక్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీఏవో పుల్లయ్య, ఉద్యానవనశాఖ కార్యాలయంలో ఏడీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ కార్యాలయంలో ఏడీ శ్రీనివాస్, పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి బి.కిషన్, మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వై.సాంబశివరావు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కైలాస్‌నగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ ఆధ్వర్యంలోని చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు అసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఒకటి, కౌన్సెలర్ ఒకటి, సూపర్ వైజర్ 3 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్హతలు, దరఖాస్తు వివరాల కోసం adilabad. telangana. gov.in/ adilabad. nic. inలో సంప్రదించాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13లోపు జిల్లా కేంద్రంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నా వ్యాఖ్యలు వక్రీకరించడం సరికాదు

- క్రైస్తవ మతాన్ని కించపరచలేదు
- ఆదివాసీల కోసం చావుకైనా సిద్ధం
- ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: పాస్టర్లపై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయపబ్బం గడుపుకోవడం సరికాదని ఎంపీ సోయం బాపురావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనజాతి సురక్ష మంచ్ బహిరంగ సభలో ఏజెన్సీ ప్రాంతాల్లో అమాయక ఆదివాసీలను బలవంతపు మతమార్పిడి చేస్తున్న కొంతమంది పాస్టర్లను మాత్రమే విమర్శించానని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలను క్రైస్తవ సంఘాలు అపార్థం చేసుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఓ వర్గం వారు ఆదివాసీ జాతి యువతులను మాయమాటలతో లవ్ జిహాద్ ఉచ్చులో దించుతున్నారని, దీంతో సనాతన సంస్కృతి, ఆదివాసీ ఆచారాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిపారు. అంతరించిపోతున్న జాతి మనుగడ, అస్తిత్వం కోసం 70 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల బహిరంగ సభలో మతం మారిన ఆదివాసీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేయడమే కాక తీర్మానం సైతం చేశామని వెల్లడించారు. ఆదివాసీల సంస్కృతిపై దాడి చేస్తున్న ఓ ముఠా గురించి తాను మనోవేదనతో ఘాటు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇలా బలవంతపు మతమార్పిడి చేస్తున్న కొంత మంది పాస్టర్లపై బుల్లెట్ల మాదిరిగా ప్రతిఘటిస్తామని వ్యాఖ్యానించడం జరిగిందని తెలిపారు. జాతి కోసం ఉద్యమాలు చేస్తున్న తనపై కొందరు అకారణంగా విమర్శలు, ఆరోపణలు చేస్తూ రాద్ధాంతం చేయడం మానుకోవాలని హితవు పలికారు. తాను క్రైస్తవ మతాన్ని కించపరచలేదని స్పష్టం చేశారు. ఆదివాసీ జాతి కోసం చావుకైనా సిద్ధమేనని, అన్ని మతాలు తన దృష్టిలో సమానమేనని, కొన్ని ముఠాల చర్యలను మాత్రమే తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

మెన్యూ

- మధ్యాహ్న భోజనంలో మార్పులు
- ప్రతీరోజు పప్పన్నంతో పాటు కిచిడి
- ఈనెల 12 నుంచి కొత్త మెనూ అమలు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థులకు మరింతగా నాణ్యమైన భోజనం అందనుంది. పాఠశాలలు పునఃప్రారంభమైన జూన్ 12 నుంచి ఇది అమలులోకి రానుంది. ఇందులో భాగంగా ఇక నుంచి ప్రతిరోజు పప్పు అన్నంతోపాటు కొత్తగా కిచిడి కూడా విద్యార్థులకు వడ్డించనున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 1,137 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 69,756 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 1,729 మంది మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారు. కాగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.45 పైసల చొప్పున, అలాగే ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులకు రూ.8.17 పైసల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. దీంతోపాటు వారానికి మూడు రోజుల పాటు కోడిగుడ్లు పెట్టాల్సి ఉంది. ఒక్కో గుడ్డుకు రూ.5 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది.

మెనూ అమలయ్యేనా..

సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అమలు కావడం లేదనే విమర్శలున్నాయి. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడమే కారణంగా తెలిసింది. దీంతో గతేడాది పలు పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ప్రతిరోజు మెనూ పాటించాల్సి ఉండగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పట్టించుకోకపోవడంతో మెనూ జాడ లేకుండా పోయింది. నూతన విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందో.. లేదో వేచి చూడాల్సిందే. అయితే వారానికి మూడు రోజుల పాటు కోడిగుడ్లు పెట్టాల్సి ఉండగా, జిల్లాలోని ఏ పాఠశాలలో కూడా ఇది పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. చాలా చోట్ల అన్నం, నీళ్ల పప్పే దిక్కవుతుంది. చేసేది లేక కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకోవడం గమనార్హం.

కొత్త మెనూ ఇదే..

వారం	భోజనం
సోమ	పప్పు, కిచిడి, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
మంగళ	రైస్, పప్పు, సాంబార్, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి
బుధ	రైస్, పప్పు, ఆకుకూరలు, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
గురు	పప్పు, వెజిటెబుల్ బిర్యాని, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి
శుక్ర	అన్నం, పప్పు, సాంబార్, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
శనివారం	అన్నం, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి

మెనూ పకడ్బందీగా అమలు చేస్తాం

ఈ విద్యా సంవత్సరంలో కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేస్తాం. ప్రతిరోజు పప్పుతో పాటు కొత్తగా కిచిడిని మెనూలో పొందుపర్చారు. దీనికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారానికి మూడు రోజుల పాటు విద్యార్థులకు కోడిగుడ్లు అందేలా చూస్తాం. ఎంఈవోలతో పాటు సెక్టోరియల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను తనిఖీలు చేసేలా ఆదేశాలు జారీ చేస్తాం.

– ప్రణీత, డీఈవో

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

- జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, ఈనెల 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు చొరవ చూపాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు డబ్బుతో పాటు సమయం ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ శివరాం ప్రసాద్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలజైన్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవార్, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్ష చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: పేస్కేల్ అమలుతో పాటు వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సత్యాగ్రహ దీక్షకు దిగారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట శుక్రవారం దీక్ష చేపట్టారు. అంతుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ, 15 ఏళ్లుగా విద్యాశాఖకు అనుబంధంగా ఉంటూ సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు పేస్కేల్ అమలు చేయాలన్నారు. వీరికి పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవీందర్‌రెడ్డి, స్వామి, అశోక్, జలేందర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, వృకోదర్, గోపీకృష్ణ, శ్రీనివాస రెడ్డి మద్దతు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్, బాధ్యులు ప్రశాంత్ రెడ్డి, దీప్తి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన గురుకులం ఆధ్వర్యంలో పీవీటీజీ విద్యార్థిని, విద్యార్థుల కోసం హయాత్‌నగర్, హైదరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికై ఈ నెల 6న మంగళవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్ శుక్రవారం తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, గ్రూపుల్లో ప్రవేశం పొందుటకై ఉమ్మడి జిల్లాలోని కొలాం, తోటి, మన్నె గిరిజన తెగలకు చెందిన బాల బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ప్రవేశం పొందిన వారికి కళాశాలలో ఉచిత వసతి, భోజనంతో పాటు జేఈఈ/ఎన్‌ఈఈటి/ఎంసెట్/సిఎల్ఎటి కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. టెన్త్‌లో వచ్చిన జీపీఏ మార్కుల ప్రకారం ప్రవేశంలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

జాతీయ సెమినార్‌కు ముఖరా(కె) సర్పంచ్



సర్పంచ్ గాడ్గే మీనాక్షి

ఇచ్చోడ: ఈ నెల 5న ఢిల్లీలో నిర్వహించే జాతీయ పర్యావరణ సెమినార్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందినట్లు ముఖరా (కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి శుక్రవారం తెలిపారు. కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పంచాయతీ పరిధిలో లక్ష మొక్కలు నాటి పర్యావరణం కోసం ప్రత్యేక కృషి చేసినందుకు పర్యావరణ కేంద్ర మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపింది.

అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధం



దగ్ధమైన పశువుల పాక

తాంసి: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. పశువుల పాకలో నిల్వ ఉన్న పశుగ్రాసంతో పాటు స్ప్రింక్లర్, వ్యవసాయ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పంటచేలల్లో వ్యర్థాలను కాల్చే క్రమంలో నిప్పు రవ్వలు ఎగిసిపడి గోవర్ధన్‌రెడ్డికి చెందిన పశువుల పాకపై పడి మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ సమీపంలో బీజేపీ ముధోల్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రావు పటేల్ రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. శుక్రవారం పల్లె పల్లెకు బీజేపీ గడపగడపకూ మోహన్‌రావుపటేల్ కార్యక్రమం కోసం ముధోల్ మండలానికి వెళ్తుండగా దేగాం గ్రామ శివారులో వీరి వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. పలువురు నాయకులు అతడిని పరామర్శించారు.

చంద్రశేఖర్ వృత్తిరీత్యా ఓ ప్రైవేట్ ఉద్యోగి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నిర్మల్ జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. తనకొచ్చే ఇరవై వేల జీతంలో నెలవారి ఖర్చుల్లో దాదాపు రూ.1200 –1500 వరకు మినరల్ వాటర్‌కే వెచ్చిస్తున్నాడు. కుటుంబంతో బయటకి వెళ్లినప్పుడు కూడా వాటర్ బాటిళ్లు కొని తాగుతుంటాడు. ఇలా అధికంగా వాటర్ తాగేందుకు ఖర్చు చేస్తున్నాడు. ఇది కేవలం చంద్రశేఖర్ పరిస్థితి మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరిదీ ఇలాంటి పరిస్థితే..



నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్

‘మంచినీళ్ల’లా ఖర్చు

- కుటుంబ ఖర్చులో పెరుగుతున్న మంచినీటి వాటా ..
- మినరల్ వాటర్ డబ్బాల వాడకానికే జనం మొగ్గు
- పాలఖర్చుతో నీటి ఖర్చు పోటీ....
- పట్టణాలతో పాటు పల్లెలకు పాకిన మినరల్ సంస్కృతి
- అప్రమత్తత అవసరమంటున్న ఆరోగ్యనిపుణులు

కుటుంబ ఖర్చులో మంచినీటి వాటా...

నలుగురు సభ్యులున్న కుటుంబం రోజుకు సగటున 20లీటర్ల వాటర్ క్యాన్‌ను వినియోగిస్తుంది. ఆ 20లీటర్ల వాటర్ క్యాన్ ప్రాంతాన్ని బట్టి రూ.15 నుంచి 20 వరకు విక్రయిస్తున్నారు. డోర్ డెలివరీ చేస్తే అదనంగా మరో రూ.10–15 వసూలు చేస్తున్నారు. ఇలా ఒక కుటుంబం రోజుకు సగటున రూ.30 చొప్పున నెలకు రూ.900వరకు వెచ్చిస్తోంది. ఇది కాకుండా ఆ కుటుంబంలో ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే వాటర్ బాటిల్‌ను కొని తాగుతున్నారు. లీటరు వాటర్ బాటిల్ ఖరీదు రూ.20 ఉంది. ఇలా నెలలో సగటున ఐదారు బాటిళ్లు తాగినా రూ.100 వరకు ఖర్చవుతోంది. అంటే నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు కేవలం మంచినీళ్లకే వెచ్చించాల్సి వస్తోంది. ఇక కార్యాలయాలకు 20 లీటర్ల వాటర్ క్యాన్ రూ.25–30కు సరఫరా చేస్తున్నారు. మారిన పరిస్థితుల్లో కూలింగ్ మినరల్ వాటర్ పేరిట కూడా నీటిని అమ్ముతున్నారు. 20 లీటర్ల కూలింగ్ క్యాన్‌కు రూ.40–50 వరకు వసూలు చేస్తున్నారు.



అపరిశుభ్ర వాతావరణంలో నీటిడబ్బాలు

నిర్మల్‌ఖిల్లా: జీవకోటికి నీరే ప్రధానం. అలాంటి నీరు ప్రస్తుత తరుణంలో తాగేందుకు పనికిరాకుండా పోతోంది. దీంతో నిర్మల్, ఖానాపూర్, భైంసా తదితర పట్టణాల్లో దాదాపు 70శాతం మందికిపైగా ప్రజలు మినరల్ వాటర్ డబ్బాలను వినియోగించేందుకు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో సైతం సగానికి పైగా ఈ మినరల్ వాటర్ క్యాన్లకే అలవాటు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 300వరకు వాటర్‌ప్లాంట్లు ఉన్నట్లు అనధికార అంచనా. ఇందులో 80శాతానికి పైగా ప్లాంట్లకు సరైన అనుమతులు లేవని తెలుస్తోంది.

పాలతో నీళ్లకు పోటీ..

ప్రస్తుతం మార్కెట్‌లో అర లీటరు పాల ప్యాకెట్ ధర.30 నుంచి 40 వరకు ఉంది. పాలకు వెచ్చించే సొమ్ము గరిష్టంగా రూ.900 అవుతుంది. అంటే పాలతో నీళ్ల ధర పోటీ పడుతోందని స్పష్టమవుతోంది. మినరల్ వాటర్‌పై మోజుకు ఇది అద్దం పడుతోంది.

ఆదాయ వనరుగా..

ప్రజల తాగునీటి అవసరాలను ఆదాయ వనరుగా మార్చుకున్న వ్యాపారులు విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. హోటళ్లు, చిరువ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు మినరల్ వాటర్ కొనడంతో నీటి వ్యాపారం అధికమైంది.

నాణ్యతలేని మినరల్ వాటర్‌తో ఆరోగ్యసమస్యలు..



నాణ్యతలేని మినరల్ వాటర్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. వీటిని తాగడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. వీటిని తాగడంతో కిడ్నీల్లో రాళ్లు, తక్కువ వయసులోనే మోకాళ్ల నొప్పులు ఏర్పడే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్స్, వాటర్ క్యాన్లలో వచ్చే నీటిలో శరీరానికి అవసరమైన కాల్షియం, సోడియం, ఫాస్పరస్, సల్ఫర్, మెగ్నీషియం వంటి మినరల్స్ లోపిస్తాయి. క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయి.

– డాక్టర్ నాళం శశికాంత్, లాప్రోస్కోపిక్ సర్జన్, నిర్మల్

తప్పనిసరి పరిస్థితుల్లో...



ఉద్యోగరీత్యా నిర్మల్ పట్టణంలో ఉంటున్నాం. మాకున్న ఆర్థిక పరిస్థితుల వల్ల మేము వాటర్ ప్లాంట్ నుంచి ఇంటికి డోర్ డెలివరీ తెచ్చే వాటర్ క్యాన్‌ను తీసుకుని తాగుతున్నాం. వీటికి ప్రతీనెల సుమారు రూ.1000 ఖర్చవుతోంది. వాటర్ ప్లాంట్‌లపై సంబంధిత అధికారులు నిఘా పెంచాలి. నీటి నాణ్యతలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

– చాట్ల రమేష్, ప్రైవేట్ ఉపాధ్యాయుడు, నిర్మల్

మనస్తాపానికి గురై ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్‌కు చెందిన ఎస్ సాయినాథ్(35) మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. సాయినాథ్ కొన్నేళ్లుగా అనారోగ్యం(ఫిట్స్)తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తనకు పెళ్లి చేయాలంటూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. గురువారం సైతం ఇదే విషయమై గొడవపడ్డాడు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. 10గంటల ప్రాంతంలో అతడి సోదరుడు దాబాపై నుంచి కిందకు వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి భారతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరి కుంట కాలనీలోని 21 అడుగుల ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తిభావం వెల్లివిరిసేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా ఉండి భారీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. సనాతన విలువలను భావితరాలకు అందజేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల వెంకన్న నాయకులు మిష్టి, భూమన్న కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటి పెద్దదిక్కు.. ఆ చిన్నారి

- కిడ్నీ వ్యాధితో మంచానికే పరిమితమైన తండ్రి
- ఎనిమిదేళ్ల క్రితం తల్లి మృతి
- మానసిక వికలాంగురాలైన సోదరి
- అన్నీతానై కుటుంబ భారం మోస్తున్న చిన్నారి
- మాటలు రాకపోయినా కడుపు నింపుతున్న వైనం..



ఆ కుటుంబాన్ని చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోవాల్సిందే. తల్లి ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. తండ్రి కిడ్నీ వ్యాధితో మంచానికే పరిమితమయ్యాడు. అక్క మానసిక వికలాంగురాలు. ఎనిమిదేళ్ల ఆ చిన్నారికి మాటలు రావు(మూగ). అయినా ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా మారింది. అన్నీతానై కుటుంబాన్ని చూసుకుంటోంది. ఉండేందుకు సరైన ఇళ్లు లేదు. ఎలాంటి ఆదాయ వనరులు లేకపోవడంతో ఇంటింటా తిరుగుతూ కుటుంబం కడుపునింపుతోంది.



ఉంటున్న ఇల్లు

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన మలారిసింగ్, ఊర్మిళకు నలుగురు కూతుర్లే. రెండవ కూతురు సరిత మానసిక వికలాంగురాలు. నాల్గో కూతురు గంగోత్రి మూగ. గంగోత్రి ఏడాది కాకముందే 2015లో అనారోగ్యంతో తల్లి ఊర్మిళ మృతిచెందింది. దీంతో కూతుర్లను తండ్రి మలారిసింగ్‌తో పాటు నాన్నమ్మ భాగవతిబాయి చూసుకున్నారు. 2016లో పెద్ద కూతురు కల్పనకు పెళ్లి చేశాడు. 2017లో నాన్నమ్మ భాగవతిబాయి మృతి చెందింది. అప్పటి నుంచి తండ్రి మలారిసింగ్ కూలీ పనిచేస్తూ కూతుర్లను పెంచాడు. 2022లో మూడో కూతురు మీనాక్షికి సైతం వివాహం చేశాడు.

విధి వంచించడంతో...

ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి మరో ఇద్దరు కూతుర్లను చూసుకుంటున్న తండ్రి మలారిసింగ్‌కు ఏడాది క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధి సోకింది. దీంతో ఆయన మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పరిస్థితి చిన్నాభిన్నమైంది. పూటగడవం కష్టంగా మారడంతో మూగ అమ్మాయి గంగోత్రి ఇంటింటా తిరుగుతూ కావాల్సిన భోజనం సమకూరుస్తుంది. అక్క సరితకు, తండ్రి మలారిసింగ్ కడుపు నింపుతోంది.

కుటుంబ బరువు మోస్తున్న చిన్నారి...



ఇద్దరు కూతుర్లతో తండ్రి మలారి సింగ్

చికిత్సకు డబ్బులు లేక...

మలారిసింగ్ కనీసం చికిత్స చేసుకోలేని దుర్భర స్థితిలో ఉన్నాడు. గతంలో వైద్యులు రాసిచ్చిన మందులనే ఎవరైనా కొనిస్తే వాడుకుంటున్నాడు. చికిత్సకు, డయాలసిస్ చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక తల్లడిల్లుతున్నాడు. దాతలు స్పందించి ఆ చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్పందించాల్సిన దాతలు...

చౌహాన్ వినోద్ : గూగుల్ పే, ఫోన్ పే

7670921393

నడవలేని స్థితిలోని తండ్రికి ప్రతి రోజు సపర్యలు చేస్తుంది. స్నానం చేయించడం మొదలు అన్నం తినిపించే వరకు అన్నీతానై చూసుకుంటుంది ఆ చిన్నారి. అక్క సరిత మానసిక వికలాంగురాలు కావడంతో ఎటువెళ్లినా గ్రామంలో వెతికి ఇంటికి తీసుకువస్తుంది. మాటలు రాకపోయినా ఆ చిన్నారి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తోంది.

ఐటీడీఏలో దశాబ్ది ఉత్సవాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ప్రశంసాపత్రాలు ఇస్తున్న శిక్షణ సహాయ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ పాల్గొని అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో గిరి పోషణ కార్యక్రమం ద్వారా 12371 గర్భిణులకు, బాలింతలకు, 3–6 సంవత్సరాల పిల్లలకు ఆరు రకాల పోషక ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు జిల్లా, ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, 6 సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఉట్నూర్ ఆస్పత్రిలో ఎన్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ ద్వారా నవజాత శిశువులకు, తల్లులకు పౌష్టికాహారలేమితో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని, కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ కేంద్రంలో ఇప్పటి వరకు 6044 మందికి వైద్య సేవలు అందించినట్లు వివరించారు. అదే విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యందు గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందని అందులో 6 పెట్రోల్ పంపులు స్థాపించి నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉద్యోగులకు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో జనరల్ భీంరావు, ఈఈ భీంరావు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.





‘ఆచార్యుడి’కి అవమానం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నిర్మల్ పట్టణంలో అమరవీరుల స్తూపం, ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ప్రతి రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజును పూలతో అలంకరిస్తారు. కానీ ఈ ఏడాది అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పూలమాలలు కూడా వేయకుండా వదిలేశారు. మున్సిపల్ ఎదుట అమరవీరుల స్తూపానికి నివాళులర్పించడం మరిచి అవమానించారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్ నిర్మల్

నియోజకవర్గానికి స్వాతంత్య్రం ఇంకా రాలేదు

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

పెంబి: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు గడుస్తున్నా సందర్భంలో ఊరూరా దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ ఖానాపూర్ నియోజకవర్గానికి ఇంకా స్వాతంత్య్రం రాలేదని మాజీ ఎంపీ, నియోజకవర్గ బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. బీజేపీ గ్రామ బూత్ అధ్యక్షులు సైనికుడిలా పనిచేయాలని, రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే పాలిస్తుందన్నారు. దీనికోసం గ్రామాల్లోని బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ రోడ్లు, కరెంట్, కనీస నీటి సౌకర్యం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జానుబాయి, నియోజకవర్గ నాయకులు పడాల రాజశేఖర్, మండల అధ్యక్షుడు సదాశివ్ ఉన్నారు.